కుక్కలున్నాయ్ జాగ్రత్త..

- నగర పంచాయతీలో హడలెత్తిస్తున్న శునకాల గుంపులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజానీకం
- పట్టించుకోని యంత్రాంగం


పట్టణ ప్రధాన రహదరిలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

పాలకొండ రూరల్: ఇటీవల కాలంలో డివిజన్ కేంద్ర మైన పాలకొండ నగర పంచాయతీలో వీధి కుక్కలు స్థానికులను హడలెత్తిస్తున్నాయి. ఏ వార్డులో చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడికి దిగుతున్నాయి. పాదచారులు, వాహనచోదకులే లక్ష్యంగా దాడి చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. పట్టణ పరిధిలోని 20 వార్డుల్లోనూ కుక్కల బెడద ఉంది. ఎవరైనా వీధుల్లోకి వస్తే కుక్కలు ఉన్నాయి జాగ్రత్త.. అని హెచ్చరించాల్సి వస్తోంది.

నిర్లక్ష్యం చేస్తే..

వీధి కుక్కల సంచారంతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణంలో ఏ వీధికి వెళ్లినా కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్, శ్రీనివాసనగర్, మురళీమోహన్ నగర్, గారమ్మ కాలనీతో పాటు మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంటోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే తమ పిల్లలు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు ఆందోళన తప్పడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

రేబిస్ వ్యాధి లక్షణాలు ఇలా...

కుక్క కాటు వలన ప్రాణంతక రేబిస్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. ఈ వైరస్ బారిన పడిన వారికి జ్వరం, తలనొప్పి, విరేచనాలు, వాంతులు, తలనొప్పి వస్తాయి.

- కాళ్లు చేతులు పడిపోవడం (పక్షవాతం), ఫిట్స్, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు తలెత్తుతాయి.
- ఈ వైరస్ బారిన పడితే తొలుత కండరాలు, అటుపై శ్వాస సంబంధిత నాళాలకు వ్యాధి వ్యాపిస్తుంది.
- ఈ వ్యాధికి గురైన కుక్కలు కూడా మందకొడిగా వ్యవహరిస్తాయి. నోటి నుంచి సొంగ కారడం, ఒంటరిగా ఉండడాన్ని గమనించవచ్చు.
- నీటికి దూరంగా ఉండటం, గుండ్రంగా తిరిగే కుక్కలకు దూరంగా ఉండాలి.
- కుక్క కాటుకు గురైన వారిలో ఆకలి తగ్గి, తల తిరుగుతుంది. నీటిని చూస్తే భయపడతారు.

జాగ్రత్తలు పాటించాలి......

- కుక్క కరవగానే వీలైనంత త్వరగా పైనుంచి నీరు పడేలా చూడాలి. వీలుంటే కుళాయి నీరు పడేలా చూసుకుని గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి.
- గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు. ఓపెన్‌గానే ఉంచాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలు ఏమీ లేవు.
- కరిసిన కుక్కను పది రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది. కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.
- వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. ఏఆర్వీ వ్యాక్సిన్ 0, 03, 07, 14 రోజుల్లో ఒక డోస్ చొప్పున తీసుకోవాలి.

బయటకు వెళ్లాలంటే భయం..



కుక్కల సంచారం ఇటీవల అధికంగా ఉంది. బయటకు వెళ్లాలంటే హడలిపోతున్నాం. పదుల సంఖ్యలో ఈ గుంపులు ప్రధాన రహదారుల్లో, వీధి కూడళ్ల వద్ద సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, ఏరియా ఆస్పత్రి మార్గంలో, కార్గిల్ కూడలి ఇలా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. నగర అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది. **– టి.రామకృష్ణ, కోమటిపేట, పాలకొండ పట్టణం**

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: సూపర్ జీఎస్టీపై విద్యార్థులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పాలకొండ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ పి.శంకరరావు అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రిన్స్‌పాల్ బి.రేణుక నేతృత్వంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో యాలం సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ప్రభువు సాగర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వాహకులు వెలమల అప్పారావు, యూ.సత్యప్రభ, రమేష్, విజయగౌరి, బాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. మండల పరిధిలోని 16 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా..వీరికి వాలీబాల్, కబడ్డీ, యోగా, షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి. భీముడు పోటీలను పర్యవేక్షించారు.

సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు


మండల స్థాయి పోటీల్లో సత్తా చాటిన కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన మండల స్థాయి అండర్ 14, 17 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, పీడీ మురళి తెలిపారు. డి.ప్రణీత్, బి.వరుణ్,సింహ చక్రిలు పోటీల్లో రాణించి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే కబడ్డీ, ఖోఖో పోటీల్లో కూడా విద్యార్థులు రాణించారని చెప్పారు.

అవగాహన కల్పించాలి


ద్రావణాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట దిగుబడులు పెంచేందుకు రైతులకు క్షేత్ర స్థాయిలో మరింత అవగాహన కల్పించాలని ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలసలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, మండలాలకు చెందిన ఎన్‌పీఎం షాపు యజమానులకు వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు, జీవామృతాల తయారీపై బుధవారం శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పొడవునా పచ్చదనం ఉండాలంటే మిశ్రమ పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి రమాప్రభ, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, ట్రైనర్స్ సింహాద్రి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ హరిబాబు

సీతంపేట: గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.హరిబాబు అన్నారు. మండలంలోని దేవనాపురంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారున. చిన్నతనంలో పిల్లలకు వివాహం చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఎస్సై అమ్మన్నరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మూర శ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 25 మంది క్రీడాకారులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానందం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్, గిరిజన బాలురు, బాలికల ఆశ్రమపాఠశాల, భామిని ఈఎంఆర్ఎస్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ రామ్మోహనరావు, తదితరులు అభినందించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరాలు రేపు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి, గిజబ గ్రామాలలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆవాల సింహాచలమమ్మ, మండల భాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తోటపల్లిలోని గ్రామ సచివాలయం వద్ద.. గిజబలోని రామమందిరం వద్ద శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం


కొమరాడ: జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: తగ్గిన జీఎస్టీతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఎంఈఓ బి.చంద్రశేఖర్, గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెర్లి రవికుమార్ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేటలో కళాశాల విద్యార్థులతో కలిసి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. జీఎస్టీ శ్లాబులు తగ్గడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.



ఎల్విన్‌పేట వద్ద జీఎస్టీపై అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీ

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధ్యాపకుడు ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వమించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలు



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి శ్యామల

కొమరాడ: భూముల రీ సర్వే పనులు సక్రమంగా జరగడం లేదని, అధికారులు స్పందించి పక్కాగా రీ సర్వే చేపట్టాలని తొడుము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన ఎంపీడీఓ మల్లికార్జునావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అయితే సమావేశంలో పూర్తి స్థాయిలో అధికారులు హాజరు కాకపోవడం.. గతంలో జరిగిన సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవ్వడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తొడుము సర్పంచ్ మాట్లాడుతూ..రీ సర్వేలో తప్పులు చోటుచేసుకుంటున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సభ్యులు తెలియజేసిన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపు మాట మరిచారా..!

- మాజీ ఎమ్మెల్యే కళావతి


భామినిలో ఏనుగులు పాడు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే , తదితరులు

భామిని: గిరిజన ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరిగే ఏనుగులను తరలించి.. పంటలను కాపాడతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. మండల కేంద్రం పరిసరాల్లో ఏనుగులు నాశనం చేసిన మొక్కజొన్న పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలతో పాటు ఏనుగుల గుంపు వల్ల పంటలు నాశనమైనా కూటమి ప్రభుత్వం బాధిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఆమె వెంట బోడెపు శ్రీనివాసరావు, బోనగడ్డి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణారావు, పైలా వాసు, రైతులున్నారు.

ఎగ్ రైస్ పెట్టండి

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఏపీ స్టేట్ ఫుడ్ కమిషనర్ సీహెచ్ విజయ్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. ఉప్మా తినలేకపోతున్నామని విద్యార్థులు చెప్పగా... ఉప్మాకు బదులు ఎగ్ రైస్ పెట్టాలని ప్రిన్సిపాల్ బాబూరావును ఆదేశించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు పాటుపడాలి..

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్‌ను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయండి..

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల వసతిగృహాలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక జీసీసీ గోదాంలోని సరుకుల నిల్వలు, గొయిది, సీతంపేట డీఆర్‌డిపోలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ కృష్ణవేణి, సీడీపీఓ సిమ్మాలమ్మ, డీటీ శ్రీవిద్య, ఎస్సై వై.అమ్మన్నరావు, ఎంఈఓ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

కురుపాం: విద్యార్థులకు సరఫరా చేసే ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి తగదు


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

పాలకొండ రూరల్: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి హేయమైన చర్యగా భారత్ కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అభివర్ణించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ స్థానిక యాలం కూడలిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి బి.అప్పలనాయుడు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగించేందుకు దిశా నిర్దేశనం చేసే సుప్రీంకోర్టు సీజేఐపై మతోన్మాదులు దాడికి యత్నించారన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ద్వారపూడి అప్పలనాయుడు, గోపినాయుడు పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం


ఈఓ, ప్రధాన అర్చకులను సన్మానిస్తున్న ఈయూ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అందరి సమన్వయంతో దేవదాయ శాఖాధికారులు విజయవంతంగా చేపట్టారని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ పార్వతీపురం మన్యం జోనల్ కార్యదర్శి బీకే.మూర్తి అన్నారు. ఈ ఏడాది 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఓ ఎత్తు అయితే.. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని వర్గాల మన్ననలు పొందడం మరో విశేషమన్నారు. అనంతరం ఈఓ వీవీ సూర్యనారాయణ, ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మలను బుధవారం ఘనంగా సన్మానించారు.

పరామర్శలు


వీరఘట్టం: మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్రాపు నరసింహనాయుడు ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుమారుడు ఉమ మహేశ్వరరావుకు సానుభూతి తెలియజేశారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు దోకల శ్రీనివాసరావు, జి.గౌరీశంకర్, ఎం.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలమెట్టలో..

వీరఘట్టం: మండలంలోని పాలమెట్ట గ్రామానికి చెందిన తోలాపు సంఘంనాయుడు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీతో అతనికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీతో పాటు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తోలాపు విశ్వనాథంనాయుడు, లక్ష్మంనాయుడు, మజ్జి పారినాయుడు, పర్రి కృష్ణ, గేదెల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.


భామిని: సింగిడిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని అనంతగిరికి చెందిన పైల మోహనరావు (80), సింగిడికి చెందిన యాగాటి మల్లేసు (65), బిల్లుమడకు చెందిన దామోదర భగవాన్ (72) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే కళావతి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈమె వెంట పార్టీ నాయకులు టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, బోడెపు శ్రీనివాసరావు, పిరపక శ్రీను, శరత్‌చంద్ర సాంత్రో, సిగడాన రాజు, పైల వాసు, పతివాడ పగడాలమ్మ, దామోదర ఆపీస్, తదితరులున్నారు.

127 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వీరఘట్టం:

స్థానిక సత్యసాయి సేవా మందిరంలో జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో హిందూస్థాన్ షిప్‌యార్డ్ వారి సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 127 మందికి పరీక్షలు చేసినట్లు క్యాంప్ కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 60 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో హిందూస్థాన్ షిప్‌యార్డ్ జనరల్ మేనేజర్ కోటీశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ ప్రశాంత్, డీజీఎం వి.రమేష్, ఎస్.అప్పలరాజు, కిల్లారి భీముడు మాస్టారు, గెంబలి మురళి, తదితరులు పాల్గొన్నారు.

మానసికంగా దృఢంగా ఉండాలి

- కేజీబీవీ ప్రిన్సిపాల్ ఐ.కిరణ్‌కుమారి

కురుపాం: ప్రతి విద్యార్థీ మానసికంగా దృఢంగా ఉండాలని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ ఐ.కిరణ్‌కుమారి అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కెరీర్, మానసిక జిల్లా కౌన్సిలర్ రేవెళ్ల అనంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..మెరుగైన ఆరోగ్యానికి సమతుల ఆహారం తప్పనిసరన్నారు. మానసిక ఒత్తిడి, భావోద్వేగ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు .

బయటపడిన డొల్లతనం

- అసంతృప్తి వ్యక్తం చేసిన ఆహార కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి


ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను మందలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

పాలకొండ: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించాల్సిన ఆహారంలో జరుగుతున్న డొల్లతనం ఆహర కమిషన్ చైర్మన్ పర్యటలో బయటపడింది. రేషన్ దుకాణాలలో జరుతున్న మోసాలు వెలుగుచూశాయి. ఆహర కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి మండలం, పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ దుకాణాలను బుధవారం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా మండలంలోని సింగన్నవలస, పట్టణంలోని నక్కలపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో సరుకుల పంపిణీ సక్రమంగా లేదని.. రికార్డుల ప్రకారం పిల్లలు ఉండడం లేదని గుర్తించారు. లబ్ధిదారులకు సక్రంగా సరుకులు పంపిణీ చేయని అంగన్‌వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సింగన్నవలస ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం ఇంటి వద్ద వంట చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయడం లేదని నిర్వాహకులను మందలించారు. ఇందిరానగర్ కాలనీలోని రేషన్ దుకాణం పరిశీలించి, సరుకుల్లో తేడాలు ఉండడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో ఆయనతో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నష్టపోయిన రైతులకు అండగా ..



సమావేశంలో రైతు సమస్యలు వివరిస్తున్న రైతు సంఘ నాయకుడు అప్పలనాయుడు

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక రైతుసంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గాలులతో కూడిన వర్షాలకు వరి, అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యంగా జిల్లా పరిధిలోని భామిని, కురుపాం, కొమరాడ, సాలూరు మండలాల్లో మొక్కజొన్న, పత్తి పంటలు బాగా నాశనమయ్యాయని చెప్పారు. బాధిత రైతులను ఆదుకోవడంతో పాటు తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ఆధునీకీకరణకు, జంపరకోట మినీజలాశయం పూర్తికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు డి.అప్పలనాయుడు, ఎల్.సంఘంనాయుడు, పోమోటి వైకుంటరావు, పి.ప్రసాద్, వసంతరావు, నీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


వన్యప్రాణుల గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దాలినాయుడు అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. చట్టాలగూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.